కనుచూపు మేర కల్లాలే

- రహదారులపై కుప్పలుగా పోసిన ధాన్యం
- తేమ శాతం తగ్గించేందుకు ఆరబోత
- యంత్రాలతో వరి కోతలే కారణం



తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్న రైతులు

దెందులూరు : గ్రామాల్లో ఏ రహదారి చూసినా ధాన్యం కల్లాలుగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు వరి పొలాల్లో కల్లాలు చేసుకుని, ధాన్యం నూర్పిళ్లు చేస్తే ఇప్పుడు మారిన పరిస్థితులు దృష్ట్యా రహదారులపై ధాన్యాన్ని అరబెట్టుకోవాల్సిన పరిస్థితి అన్నదాతలకు ఎదురవుతోంది. కుప్పనూర్పిళ్లు చేసిన అనంతరం ధాన్యాన్ని రైతులు అమ్ముకోవడం, హెచ్చు ధర కోసం గాదుల్లో పోసుకోవడం వంటివి రైతులు చేసుకునేవారు. ఇప్పుడు రైతులు ధాన్యాన్ని అరబెట్టుకున్న తర్వాతే ఏ పనైనా చేయాల్సి వస్తుంది. యంత్రాలతో వరికోతలు చేపట్టడమే ఇందుకు ప్రధాన కారణం. యంత్రాలతో వరికోతలు చేపట్టడం వల్ల ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండడంతో రైతులు ప్రస్తుతం ఆధాన్యాన్ని అరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

95 శాతం యంత్రాలతోనే

సాధారణ పద్ధతిలో రైతులు వరి కోతలు కోసి, కట్టిన వరి పనలను కుప్పలుగా వేసేవారు. కుప్పలే వేసి 15నుంచి 30రోజుల్లో కుప్పలు నూరుస్తారు. దీని వల్ల తేమ శాతం బాగా తగ్గుతుంది. ప్రస్తుత కాలంలో రైతులంతా పూర్తిగా యాంత్రీకరణ వైపు మొగ్గుచూపడంతో యంత్రాలతోనే వరికోతలు కోస్తున్నారు. దీనివల్ల కోతకోసిన వెంటనే పచ్చి ధాన్యం వస్తుంది. పచ్చి ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఇలాంటి ధాన్యానికి ధర అంతగా రాదు. ధాన్యంలో తేమ శాతం 17 శాతం కన్నా తక్కువగా ఉంటేనే ఆశించిన మేర రావచ్చు. అందుకే రైతులు ప్రస్తుతం తమ ధాన్యాన్ని అరబెట్టుకునే పనిలో పడ్డారు. 95 శాతం పైగా వరికోతలు యంత్రాలపైనే సాగాయి. దీంతో వీధులు, రహదారులే కాదు. పొలాల్లో కూడా రైతులు ధాన్యాన్ని అరబెడుతున్నారు.

ముమ్మరంగా వరి కోతలు

క్లస్టర్ పరిధిలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల్లో వరికోతలను రైతులు చేపట్టారు. మొత్తం 1.01లక్షల ఎకరాల్లో సాగు చేపట్టగా, ఇప్పటికే 30శాతం కోతలు పూర్తయ్యాయి. యంత్రాలతో వరికోతలు కోస్తున్నందున ఎండ వేడి అధికంగా ఉండడంతో రాత్రి సమయంలో కూడా యంత్రాలతో వరి కోతలు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో రైతులు వరికోతలను త్వరితగతిన చేపడుతున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా సాయంత్రం సమయంలో గాలివానలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సాధారణ పద్ధతిలో కేవలం ఐదుశాతం మాత్రమే కోస్తుండగా, 95శాతం మేర యంత్రాలపై వరికోతలు సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. యంత్రాలపై వరి కోతలు కోసిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని అమ్ముకునే పనిలో ఉన్నారు.

యంత్రాలతో కోతలకే ప్రాధాన్యం



రైతులు యంత్రాలపై వరికోతలకే ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు. కూలీల కొరత కారణంగా యంత్రాలతోనే కోతలను చేపడుతున్నారు. అధిక శాతం మంది రైతులు యంత్రాల సాయంతో వరికోతలు కోస్తున్నారు.

– సుబ్బారావు, వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

పని సులువవుతోంది



యంత్రాలపై వరికోతలు కారణంగా పని సులువవుతోంది. కూలీలు దొరక్కపోవడంతో యంత్రాలను ఆశ్రయిస్తున్నాం. తేమ శాతం తగ్గించుకోవడానికి అరబెట్టాల్సి వస్తోంది. అయినా తప్పట్లేదు. కూలి రేట్లు కూడా అధికంగా ఉన్నాయి.

– పర్వతనేని నరేంద్రబాబు, రైతు మలక చర్ల

క్లుప్తంగా

కొల్లేరు స్వాగతం బోర్డుల ఏర్పాటు



బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

దెందులూరు: కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యం సందర్శించండి అంటూ అటవీ శాఖ కొల్లేరు ప్రాంతంలో జాతీయ రహదారి వెంబడి బోర్డులను ఏర్పాటు చేస్తోంది. గురువారం దెందులూరు మండలంలో కొమిరేపల్లి, సత్యనారాయణపురం, దెందులూరు గ్రామాల్లో జాతీయ రహదారి ప్రక్కన సిబ్బంది విదేశాల నుంచి వచ్చే పక్షులను ముద్రించి బోర్డులను ఏర్పాటు చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గుండుగొలనులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

భీమడోలు: పౌష్టికాహారమే చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని గుండుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.కవిత అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం గుండుగొలను నెం.23 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ బోడ రాజమణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులతో కలిసి అవగాహన ర్యాలీను నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తు నినాదాలు చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల్లో పోషకాహార లోపాలు నివారణపై అవగాహన కల్పించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాద సమయంలో సంరక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భీమడోలు: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలు వాటి నివారణపై అవగాహన కలిగి ఉండాలని భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంభవించే అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను అందించారు. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

రాష్ట్రీయ స్టడీ టూర్‌కు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

భీమడోలు: రాష్ట్రీయ స్టడీ టూర్‌కు భీమడోలు నెం.4 పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు భీంపల్లి వినోద్, మామిడ్ రోహిత్‌లు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వినూత్న తరహా కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని ఆ పాఠశాల హెచ్ఎం జే.బుల్లిదొర, గైడ్ టీచర్ ఎం.శరీన్‌లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, చారిత్రక కట్టడాలను తిలకించేందుకు బుధవారం రాత్రి గైడ్ టీచర్ ఎం.శరీన్ ఆధ్వర్యంలో ఏలూరు నుంచి హైదరాబాద్‌కు వారు వెళ్లారు. ఎంపికైన విద్యార్థులును ఎంఈఓ 1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ కుమార్‌లు అభినందించారు.

జయరావుకు అభినందనలు



ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావును సన్మానిస్తున్న విశ్వాసులు

దెందులూరు: గురుత్వ అభిషేకాన్ని ఏసుక్రీస్తు ప్రారంభించిన రోజు దెందులూరు విశ్వాసులు తనను అభినందించడం సంతోషంగా ఉందని ఆర్‌సీఎం ఏలూరు బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. గురుత్వ స్థాపన ద్వారా గురువు దేవునికి ప్రజలకు వారధిగా సేవలందిస్తారన్నారు. దివ్య సత్ప్రసాద స్థాపన ద్వారా ప్రభువు మనతో వాసం చేస్తారని ప్రేమ ఆజ్ఞ స్థాపన ద్వారా మనం ఒకరికొకరం ప్రేమతో జీవించాలని సూచించారు. గురువారం ఆయన కార్యాలయంలో దెందులూరు ఆర్‌సీఎం ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ జి అమ్మన్ రాజా ఆధ్వర్యంలో దెందులూరు విశ్వాసులు ఉపదేశీలు యువత కలిశారు. పీఠాధిపతిని అభినందించారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాకపల్లిలో ఫీవర్ సర్వేను తనిఖీ చేస్తున్న డివిజనల్ మలేరియా అధికారి

గణపవరం: మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, వారంలో ఒకరోజును డ్రైడేగా పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. గురువారం ఆయన పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని పిప్పర, చిలకంపాడు, కాశిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్‌సర్వే, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే కార్యక్రమాలను ఆకస్మికతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంటి పరిసరాలలో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమలను లార్వా దశలోనే అరికట్టాలని వివరించారు. ఫీవర్ సర్వే రికార్డులను పరిశీలించారు. ఇళ్ల వద్ద వాడకంనీరు నిలువ ఉంటున్న మహిళలకు దానివల్ల కలిగే అనర్థాలను వివరించారు. వారానికి నీటి కుళాయిలు, వాటర్ ట్యాంకుల, నీటి తొట్టెలను శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకోవాలి



గణపవరం పంచాయతీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులు

గణపవరం: క్లీన్‌అండ్‌గ్రీన్, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్‌అంటూ అనేక పథకాలు అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పథకాల కోసం నిరంతరం చీపురుపట్టి వీధులు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమని జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు అన్నారు. గురువారం గణపవరంలో నిర్వహించిన పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సంక్షేమానికి అనేక జీలో ఉన్నప్పటికి వాటి అమలులోనే ప్రభుత్వాలకు చిత్తశుద్ధిలోపించిందని విమర్శించారు. కార్మికులకు చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు వంటివి కూడా అందించే పరిస్థితి లేదని జిల్లాలో దాదాపు అన్ని పంచాయతీలలోనూ ఇదే దుస్థితి ఉందన్నారు. సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించాలి



రైతు సంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కె.రత్నకుమారి

భీమడోలు: మహిళా రైతు సంఘాల సభ్యులు ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు ప్రభుత్వం రుణాలను అందించి వారిని ప్రోత్సాహిస్తుందని భీమడోలు ఏపీఎం కె. రత్నకుమారి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్య పరిధిలోని మహిళా రైతు సంఘాల సభ్యుల ఆర్థిక స్వావలంబనకు తీసుకోవాల్సిన అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రైతు సంఘాలను బలోపితం చేసేందుకు ప్రభుత్వం మండలానికి రూ.5 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేసిందన్నారు. మండల వ్యాప్తంగా 80 మహిళా రైతు సంఘాలున్నాయని, మరో 20 సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సంఘంలో 10 నుంచి 12 సభ్యులు ఉండాలని సూచించారు.

కాపు నేత హరికృష్ణకు జేపీ పరామర్శ



హరికృష్ణను పరామర్శిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరు నగర కాపు నాయకుడు జల్లా హరికృష్ణను వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న పార్టీ నేత కుంచాడ శ్రీనివాసు భార్యను పరామర్శించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న నాయకులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జేపీ వెంట పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాసు, నేరుసు చిరంజీవి, జాన్ గుర్నాథ్, కొల్లిపాక సురేష్, సైదు కొండ, సునీల్, ఫణి, రామకృష్ణ, తంగిల రాము, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో సదుపాయాలపై ఆరా



వృద్ధురాలితో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ గురువారం సందర్శించారు. ఇక్కడ వృద్ధులకు అందుతున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యత, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వృద్ధులతో మాట్లాడారు. న్యాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని, సంక్షేమ పథకాలను పొందడంలో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో ఇచ్చిన సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని రత్నప్రసాద్ తెలిపారు. పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం ఎక్కువగా ఉన్న దోమలు బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రక్షణ సువార్త మహోత్సవాలు

దెందులూరు: మండలంలోని దెందులూరులో యందంవారిపేట యాకోబు స్థలంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు ఎరుషలేము ప్రేయర్ మినిస్ట్రీస్ సిస్టర్ గ్రేస్ రాణి ఆధ్వర్యంలో రక్షణ సువార్త మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విశాఖపట్నం నుంచి డాక్టర్ ఆరిఫ్ గుండుగొలనుంచి పాస్టర్ జాన్ వెస్లీ, రావులపాలెం నుంచి పాస్టర్ సెల్వరాజ్ వాక్యం పరిచర్య చేయడానికి విచ్చేస్తున్నారని మండలంతో పాటు సమీప మండలాల్లోని విశ్వాసులు రక్షణ సువార్త మహోత్సవాలకు హాజరై దేవుని దీవెనలు పొందాలని సిస్టర్ గ్రేస్ రాణి కోరారు.

పరిశ్రమల విస్తరణకు కృషి

ఉంగుటూరు: దేశంలో పరిశ్రమలు విస్తరణకు కేంద్రప్రభుత్వం నరేంద్రమోదీ నాయకత్వంలో పని చేస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం ఉంగుటూరులోని శ్రీవల్లభ మెడరన్ రైస్‌మిల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు విస్తరణ వల్ల వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ మాగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం

భీమడోలు: ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. అంబర్‌పేట పంచాయతీ శివారు వడ్లపట్ల గ్రామంలో వర్థినేడి వీరాంజనేయులు, సీతామహాలక్ష్మీల జ్ఞాపకార్థం వారి కుమారుడు వర్థినేడి కపిరాజు రూ.1.15లక్షల ఆర్థిక సాయంతో నిర్మించిన వాటర్ ట్యాంకును గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విక్రమ్ కిషోర్, శరణాల మాలతీరాణి, మత్తి శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన ఆహారం అందించాలి

ద్వారకాతిరుమల: బాలింత లు బిడ్డకు ఆరోగ్యవంతమై న ఆహారం ఇవ్వడంతో పాటు, శారీరక శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార లోప నివారణకు చేపట్టాల్సిన చర్యలపై గర్భిణులు, బాలింతలకు మేరి అవగాహన కల్పించారు. గర్భిణులు కనీసం రెండు సార్లు నులిపురుగుల నివారణ మందు ఆల్బెండజోల్ వేసుకోవాలని సూచించారు. గర్భిణి 180 ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు వాడితే ప్రసూతి తర్వాత త్వరగా కోలుకుంటారని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

జంగారెడ్డిగూడెం: ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ గ్యారేజ్ గేటు వద్ద డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులతో ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో ప్రెసిడెంట్ ఎన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ 38 డిమాండ్లపై యాజమాన్యం స్పందించకపోవడంతో మూడో దశ పోరాటంలో భాగంగా నిరసన వ్యక్తం చేశామన్నారు.

విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్‌రెడ్డి పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపిక ల్లో 65 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని లారస్ ల్యాబ్స్ సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ హెచ్ఆర్ డి.సునీత తెలిపారు. వీరంతా విశాఖపట్నం, హైదరాబాద్ బ్రాంచ్‌లలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గురు శర్మకు సాహితీ సంబరాల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సాహితీ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంగా మే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు నగరానికి చెందిన కవి గురు శర్మకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కవిగా, రచయితగా, వాఖ్యాతగా అనేక రికార్డులు సొంతం చేసుకున్న గురు శర్మకు ఆహ్వానం అందడం సముచిత నిర్ణయమని నగరానికి చెందిన సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమ రావు, గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



గణపవరం: పిప్పరలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



భీమడోలు: సూరప్పగూడెంలో చిన్నారులకు కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

గణపవరం: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మానసిక పరివర్తనకు ప్రభుత్వ పాఠశాలల ఎంతగానో దోహదపడతాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గణపవరం ఎంఈఓ గొర్రెల బాలయ్య అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన 2025 సంవత్సరానికి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల య్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన బోధన, ఉన్నత విద్యార్హతలున్న ఉపాధ్యాయులు, పరిశుద్ధమైన మంచినీరు అన్ని వసతులతో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా 'ప్రభుత్వ బడి మనందరిదీ.. ప్రభుత్వ బడినికాపాడుకుందాం.. ప్రైవేటుబడులు వద్దు.. ప్రభుత్వ బడులు ముద్దు' అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

భీమడోలులో..

భీమడోలు: నైతికల విలువలతో కూడిన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో సాధ్యమని భీమడోలు ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెంలో బడి ఈడు పిల్లలను చేర్పించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఎం ఇ.దుర్గా రవిప్రసాద్‌తో కలిసి ఎంఈఓ ఇ.శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వందన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాగాశ్విని తల్లి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



విశేషాలంకరణలో అమ్మవారు

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో వెలసిన నాగాశ్విని పేరంటాలు తల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతాయని నిర్వాహకులు పూజారి అన్నవరం దుర్గమ్మ, పూజారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ 18 తేదీరాత్రి కూచిపూడి నృత్యాలు, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్, 19న రాత్రి చింతామణి నాటకం, 20న మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఉత్సవాలు చివరి రోజు 20న ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఉత్సవాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని వివరించారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ



పిప్పరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాలమహానాడు నాయకులు

గణపవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మాలమహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పరలో మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎస్సీల్లో 59 ఉపకులాలు ఉన్నాయని, వీటిలో ఏకులాలు అయితే అభివృద్ధి చెందాయో? వాటికి ప్రాధాన్యత తగ్గించి, వెనుకబడి ఉన్న కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కాని ఆ తీర్పునకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వ్యవహరిస్తూ ఎస్‌సి వర్గీకరణ చేస్తున్నాయని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ మెప్పుకోసం ఈ రెండు ప్రభుత్వాలు పని చేస్తూ మాలలను మోసం చేస్తున్నాయనివి మర్శించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చోడదాసి జైపాల్, సంతోష్, సాల్మన్, కొండేటి రాజా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలెంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : మండలంలోని అమ్మపాలెం గ్రామంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో 140మందికి వైద్య సేవలు అందజేయగా 32మందికి శస్త్ర చికిత్సలకు అవసరమని గుర్తించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి సూర్య మోటార్స్ అధినేత చామర్తి కష్టారావు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం.చలపతిరావు, పూర్వపు జిల్లా గవర్నర్ వేమా కోటేశ్వర రావు, లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, ఎల్. వెంకటేశ్వరరావు, వి.విష్ణుకుమార్, రీజియన్ చైర్మన్ వి.రత్నకుమార్, క్లబ్ కార్యదర్శి కె.బాలకష్ణ, సభ్యులు జె.రాఘవకే.ప్రసాద్, సీహెచ్ పవన్ కుమార్,కె. ప్రసాదబాబు,పి.సుబ్రహ్మణ్యం,ఎస్. పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహానికి అడ్డంకులు



కడెమ్మ కాలువలో పెరిగిపోయిన మొక్కలు, తూడు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో అతిపెద్ద సాగునీటి చెరువు కొత్తూరు చెరువు. ఇందులో కొమ్ము తిరిగిన నీటితో పాటు కొండ వాగుల నీరంతా కడెమ్మ కాలువ ద్వారా ప్రవహించి కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతుంది. సుమారు మూడు కిలోమీటర్ల పొడవున ప్రవహించే కడెమ్మ కాలువ కొన్నేళ్లుగా మరమ్మతులకు కూడా నోచుకోలేదు. దీంతో కాలువలో గుర్రపు డెక్క, తూడు, మొక్కలు పెరిగిపోయాయి. కాలువ మధ్యలో ఇసుక మేటలు వేశాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వర్షాకాలంలో కొండవాగుల నీరు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలు ముంచెత్తుతుంది. గోదావరి వరద పెరిగినప్పుడల్లా కడెమ్మ స్లూయిజ్ ద్వారా వరద నీరు ఎగపోటుకు పంట పొలాలు మునుగుతున్నాయి.

కాలువలోకి జారుతున్న మట్టి

కడెమ్మ స్లూయిజ్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వర్షాకాలంలో మట్టి జారిపోవడంతో కాలువ పూడుకుపోతుంది. దీంతో నీరు కూడా గోదావరిలోకి చేరడం లేదు. కాలువ వెడల్పు చేసి జంగిల్ క్లీనింగ్, డిసిల్టింగ్ పనులు చేస్తే సాగు నీరు అందడంతో పాటు ముంపు ముప్పు తప్పుతుందని రైతులు చెబుతున్నారు. సమస్యను మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా కడెమ్మ కాలువలో జంగిల్ క్లీనింగ్, డీసిల్టింగ్ పనులు చేపట్టేందుకు రూ.10 లక్షలతో ప్రభుత్వానికి నివేదిక పంపామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని వివరించారు.